
andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.3। కనిష్ఠం 15.2







● జిల్లాకేంద్రంలో ఓ వైన్‌షాపు ముందు మందుబాబుల రద్దీ (ఇన్‌సెట్‌లో అమ్మకానికి సిద్ధంగా మద్యం బాటిళ్లు) ➤

రూ.9.53 కోట్ల మద్యం.. తాగేశారు

- జిల్లాలో న్యూ ఇయర్ వేడుకలతో మద్యం అమ్మకాల జోరు
- బెల్ట్‌షాపుల్లో ఏరులై పారిన మద్యం
- ఎక్సైజ్ శాఖకు రికార్డు స్థాయిలో ఆదాయం
- డ్రంకెన్ డ్రైవ్‌లో 60 కేసుల నమోదు
- 31న తెగ ఎంజాయ్ చేసిన మందుబాబులు

ఆదిలాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో న్యూ ఇయర్ వేడుకల పేరిట మందుబాబులు రూ.9.53 కోట్ల మద్యాన్ని తాగేసినట్లు ఎక్సైజ్ శాఖ లెక్కల ప్రకారం తెలుస్తుంది. ప్రతియేటా డిసెంబరు 31న మద్యం అమ్మకాల జోరు ఉంటుంది. కానీ ఈ యేడు రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. గతేడు ఆదిలాబాద్ ఐఎంఎల్ డిపో పరిధిలో డిసెంబరు 31 సందర్భంగా ఒక్క రోజులోనే రూ.7కోట్లకు పైగా మద్యం అమ్మకాలు జరుగగా.. ఈయేడు అమాంతంగా పెరిగి రూ.9.53 కోట్ల ఆదాయం సమకూరింది. ముఖ్యంగా నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భైంసా పట్టణాల్లో భారీగా మద్యం అమ్మకాలు జరిగినట్లు ఎక్సైజ్ శాఖ గణాంకాల ప్రకారం తెలుస్తుంది. అలాగే కాగజ్‌నగర్, ఇచ్చోడ, ఉట్నూర్ సర్కిల్ పరిధిలో కోటి లోపే ఆదాయం సమకూరినట్లు తెలుస్తుంది. ఈ సారి డిసెంబరు 31 మంగళవారం రావడంతో మద్యం అమ్మకాల జోరు ఊపందుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. న్యూ ఇయర్ వేడుకలను దృష్టిలో పెట్టుకుని వ్యాపారులు భారీగా మద్యాన్ని కొనుగోలు చేశారు. అలాగే ప్రభుత్వం కూడా మద్యం అమ్మకాల పై ప్రత్యేక దృష్టిని సారించడంతో ఎక్సైజ్ శాఖాధికారులు వ్యాపారుల వెంటపడి మరి మద్యాన్ని లిఫ్ట్ చేసే విధంగా ప్రయత్నాలు చేశారు. అనుకున్న టార్గెట్ కంటే అధికంగానే ఆదా యం సమకూరినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు.

పల్లెల్లోనూ మద్యం కిక్కు

న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా మారుమూల పల్లెల్లోను మద్యం కిక్కు కనిపించింది. డిసెంబరు 31 సందర్భంగా మద్యం వ్యాపారులు బెల్ట్‌షాపులకు భారీగా మద్యాన్ని తరలించి అమ్మేశారు. దీంతో మద్యం అమ్మకాలు భారీగా పెరిగాయి. పట్టణం, పల్లె అనే తేడా లేకుండా న్యూఇయర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వైన్‌షాపులతో పాటు బార్లు, రెస్టారెంట్లు మందుబాబులతో కిటకిటలాడాయి. అనాధికారికంగా అమ్మకాలు జరుపుతున్న బెల్ట్‌షాపుల్లోనూ మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా జరిగాయి. సరిహద్దుల్లో మహారాష్ట్ర మద్యాని కి అడ్డుకట్ట వేయడంతోనే బెల్ట్‌షాపుల్లో మద్యం విక్రయాలు భారీగా పెరిగినట్లు తెలుస్తుంది. అంతేకాకుండా కొందరు లిక్కర్ వ్యాపారులు బినామీల పేరిట బెల్ట్‌షాపులను ఏర్పాటు చేసి మద్యం విక్రయాలు జరిపినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇదంతా అధికారులకు తెలిసినా చూసీచూడనట్లుగానే వ్యవహరించారన్న విమర్శలు వస్తున్నాయి.

ఆదిలాబాద్ డిపో పరిధిలో డిసెంబరు 31న మద్యం అమ్మకాలు ఇలా..

ఆదిలాబాద్	- రూ.కోటీ 59లక్షల 14వేల 57
ఆసిఫాబాద్	- రూ.కోటీ 45లక్షల 78వేల 16
కాగజ్‌నగర్	- రూ.76లక్షల 35వేల 375
నిర్మల్	- రూ.3కోట్ల 16లక్షల 54వేల 922
ఇచ్చోడ	- రూ.76లక్షల 88వేల 847
ఉట్నూర్	- రూ.32లక్షల 17వేల 178
భైంసా	- రూ.కోటీ 46లక్షల 57వేల 876
మొత్తం	రూ.9 కోట్ల 53లక్షల 46వేల 274

భారీగా ఆదాయం

న్యూ ఇయర్ వేడుకలతో ఎక్సైజ్ శాఖకు రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. డిసెంబరు 31న ఉదయం నుంచి మాములుగానే మద్యం అమ్మకాలు జరిగిన రాత్రి వేళల్లో ఒక్కసారిగా మద్యం అమ్మకాల జోరు కనిపించింది. అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు కొనసాగాయి. ఆదిలాబాద్ ఐఎంఎల్ డిపో పరిధిలో ఒక్కరోజులోనే రూ.9కోట్ల53లక్షల 46వేల 274 ఆదాయం సమకూరింది. ఇందులో ఆసిఫాబాద్ రూ.కోటీ 45లక్షల 78వేలు కాగా, కాగజ్‌నగర్ రూ.76లక్షల 35వేల 375, నిర్మల్ రూ.3కోట్ల 16లక్షల 54వేల 922, భైంసా రూ.కోటి 46లక్షల 57వేల 876, ఆదిలాబాద్ సర్కిల్‌లో రూ.కోటీ 45లక్షల 78వేల 116 ఆదాయం రాగా.. ఇచ్చోడ సర్కిల్‌లో రూ.76లక్షల 88వేల 847, ఉట్నూర్ సర్కిల్‌లో రూ.32 లక్షల 17వేల 178ఆదాయం ఎక్సైజ్ శాఖ ఖజానాకు వచ్చింది. న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు మందుబాబులు గత రెండు, మూడు రోజుల నుంచి ప్లాన్ చేసుకున్నారు. అసలు విషయం ఏమిటంటే లిక్కర్ కంటే బీర్ కేసులే అత్యధికంగా అమ్ముడు పోయినట్లు తెలుస్తుంది. జనవరి 1న కూడా అధికారికంగా సెలవు దినం కావడంతో భారీగానే

(తరువాయి 6వ పేజీలో...)

ప్రభుత్వ పథకాల అమలులో జిల్లాను ముందుంచుతా

● జిల్లా కలెక్టర్ రాజర్షిషా ● కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన అధికారులు, పలువురు

ఆదిలాబాద్ అర్బన్, జనవరి1(ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్క లబ్దిదారుడికి ప్రభుత్వ పథకాల అమలులో జిల్లాను ముందు వరుసలో ఉంచుతామని జిల్లాకలెక్టర్ రాజార్షిషా అన్నారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో 2025 సంవత్సర శుభాకాంక్షలను అధికారులు తెలయజేశారు. కలెక్టర్ సూచన మేరకు బుక్స్, బ్లాంకెట్స్ అందిస్తూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కోట పరందోలిలో జనవరి రెండవ తేదీ నుంచి నిర్వహించే జంగుబాయి ఉత్సవాల పోస్టర్లను నిర్వహణ కమిటీ సభ్యులు సలాం శ్యాంరావ్, మరప బాజీరావ్, కోడప జకులతో కలిసి విడుదల చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలన్నారు.యువత మంచి దిశగా వెళ్లడంతో పాటు పిల్లలు భవిష్యత్తు పై దృష్టి సారించాలన్నారు. తన పిలుపు మేరకు అధికారులు, జిల్లా ప్రజలు సామాజిక బాధ్యతగా పూలబొకేకు బదులు బుక్స్, బ్లాంకెట్స్ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. అవసరమున్న వారికి ఇవి ఉపయోగ పడుతాయన్నారు. సమాజంలో విద్య చాలా ముఖ్యమని అందుకే అవసరమున్న వారికి నోట్‌బుక్స్, మహానీయుల జీవిత చరిత్రలు తెలియజేసే మంచి పుస్తకాలు మార్గదర్శనం చేయడానికి ఉపయోగపడతాయని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

● 'ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి'

తలమడుగు: జిల్లాలో గల ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కలెక్టర్ కోరారు. బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టర్‌ను తలమడుగు మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆ తర్వాత గణేష్‌రెడ్డి మాజీ ఎంపీ సోయం బాపు రావు, అదిలాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేరడిగొండ: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాజర్షిషాను బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ తర్వాత కలెక్టర్‌కు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న అదనపు కలెక్టర్, అధికారులు, సిబ్బంది



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న తలమడుగు నాయకులు



ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న కాజల్‌సింగ్

ఉట్నూర్ ఏఎస్పీగా కాజల్‌సింగ్ బాధ్యతల స్వీకరణ

ఉట్నూర్, జనవరి1 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ అసిస్టెంట్ పోలీసు సూపరింటెండెంట్‌గా కాజల్‌సింగ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఉట్నూర్ డీఎస్పీగా పని చేసిన నాగేందర్‌ను హైదరాబాద్‌కు బదిలీ చేయగా ఆయన స్థానంలో 2021 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన కాజల్ సింగ్‌ను ప్రభుత్వం నియమిస్తూ ఆదేశాలు జారీ చేయడంతో ఉట్నూర్‌లోని సబ్ డివిజన్ పోలీసు ఆఫీసర్ కార్యాలయం చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మనోహర్, తదితరులున్నారు.



అభిమానులు తెచ్చిన దుప్పట్లు, పుస్తకాలు పెన్నులతో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

ఎమ్మెల్యేకు శుభాకాంక్షల వెల్లువ

ఉట్నూర్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌కు అభినందనలు వెల్లువెత్తాయి.ఖానాపూర్ నియోజక వర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, అభిమానులు తరలివచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఒక్కరోజు ముందుగానే నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేవారు బొకేలు,పూల కుండీలు లాంటివి పట్టుకునిరావద్దని దుప్పట్లు, పెన్నులు, ఆపీలు తీసుకు రావాలని కోరడంతో అభిమానులు చాలా మంది దుప్పట్లు, పెన్నులు, కాలపీలు తీసుకువచ్చి ఎమ్మెల్యేకు అందించారు. చలి కాలంలో చలితో బాధపడుతున్న పేదవారికి అభిమానులు అందించిన దుప్పట్లు పంపిణీ చేస్తామని, పేద విద్యార్థులకు కాపీలు పెన్నులు అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

అలాగే, మండలంలోని చందూరికి చెందిన గిరిజన అంధ విద్యార్థి కుర్సింగ శివాజీకి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ మొబైల్ ట్యాబ్‌ను బుధవారం అందజేశారు.



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపతున్న నాయకులు

ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలకు నాయకుల శుభాకాంక్షలు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలపడానికి వచ్చిన వారితో క్యాంపు కార్యాలయ పరిసరాలు కిటకిటలాడాయి. సనాతన హిందూ ఉత్సవ సమితి, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సభ్యులు, ప్రజలు, మాల సంఘం సభ్యులు క్యాంపు కార్యాలయానికి చేరుకొని ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్

కేటీఆర్‌ను కలిసిన బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ/బోథ్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను హైదరాబాద్‌లో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో రాజకీయ పరిస్థితుల పై చర్చించారు. అంతకు ముందు జిల్లాలో సమగ్ర శిక్ష ఉద్యోగులు, సీఆర్పీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

నేరడిగొండ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్‌లో గల గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతిలో ప్రవేశం, 6 నుంచి 9వ తరగతిలో మిగిలి ఉన్న ఖాళీల కోసం ఫిబ్రవరి 1వరకు ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష 23న ఉంటుందని ప్రాంతీయ సమన్వయ అధికారి పి.అగస్టిన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తరగతి బోనఫైడ్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్ ఫొటో, ఆధార్‌కార్డు, విద్యార్థి సంతకం తప్పనిసరి అని పేర్కొన్నారు.





రూ.9.53 కోట్ల మద్యం తాగేశారు

(5వ పేజీ తరువాయి...)

మద్యం అమ్మ కాలు జరిగాయి. హ్యాంగోవర్ నుంచి బయట పడేందుకు మందుబాబులు మళ్లీ మద్యాన్ని కొనుగోలు చేస్తున్నారు.

60 డ్రంకెన్ డ్రైవ్ కేసులు

డిసెంబరు 31 అర్ధరాత్రి 12.30 వరకు న్యూఇయర్ వేడుకలను నిర్వహించుకునేందుకు జిల్లా పోలీసులు అనుమతించారు. ఆ తర్వాత రోడ్ల పైకి వచ్చి హంగామా చేసిన మందుబాబులను పట్టుకుని ఊదమనడంతో 60 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. అయిన కొందరు మద్యం మత్తులో రోడ్లపై చక్కర్లు కొడుతూ న్యూఇయర్ వేడుకలను జరుపుకున్నారు. జిల్లావ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేశారు. స్వయాన జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం అర్ధరాత్రి జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో ఆకస్మికంగా డ్రంక్‌డ్రైవ్ తనిఖీలను పరిశీలించారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు అడ్డుకట్ట వేయగలిగారు.

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలి

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్ రూరల్, జనవరి 01 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన ద్వారా పాఠశాలలను బలోపేతం చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్‌శంకర్ అన్నారు. టీఎస్ యూటీఎఫ్ ఆదిలాబాద్ జిల్లా శాఖ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందడం వల్ల పేదవిద్యార్థులకు లాభం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.కిష్టన్న, ప్రధాన కార్యదర్శి వి.అశోక్, ఉపా ధ్యక్షులు టి.సూర్యకుమార్ కార్యదర్శులు ఎ.స్వామి, ఎ.ఇస్తారి, సి.విలాస్, ఇ.శి వన్న, కె.గణేష్, గౌస్ మొహియుద్దీన్, సోషల్ మీడియా కన్వీనర్ కె.శంకర్ ఉన్నారు.

జాతీయ హక్కుల కమిషన్ దృష్టికి సీఆర్టీల సమస్యలు

● సీఆర్టీల సమ్మెకు సంఘీభావం తెలిపిన టీఎస్‌టీటీఎఫ్

ఉట్నూర్, జనవరి1 (ఆంధ్రజ్యోతి): 17 రోజులుగా సమస్యల పరిహారం కోసం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ముందు నిరవధిక సమ్మె చేస్తున్న గిరిజన సంక్షేమ శాఖ కాంట్రాక్ట్ రెసిడెన్ట్ టీచర్ల సమస్యలను జాతీయ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకువెళ్తానని మాజీ మంత్రి, అఖిల భారత బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు అమర్‌సింగ్ తిలావత్ అన్నారు. బుధవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న సీఆర్టీల సమ్మె శిబిరాన్ని సందర్శించి వారికి టీఎస్ టీటీఎఫ్ రాష్ట్ర నాయకులు జాదవ్‌కపిల్ నాయక్‌తో కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో, ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న సీఆర్టీల సేవలను ఉపయోగించుకుంటున్న ప్రభుత్వం వెంటనే వారి సేవలను గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సీఆర్టీలు కోరుతున్న న్యాయమైన హక్కుల సాధన కోసం సీఆర్టీలు సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగించా లన్నారు. ఈ సందర్భంగా కపిల్‌నాయక్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ అధికారులు సీఆర్టీలు తలపెట్టిన సమ్మెను మానవతాదృక్పథంతో చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని సీఆర్టీలు పాల్గొన్నారు.

ప్రజలు అనుకున్న లక్ష్యాల వైపు చేరుకోవాలి



శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఆదిలాబాద్‌అర్బన్, జనవరి1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో తలపెట్టిన ప్రతిపని, ప్రజలు అనుకున్న లక్ష్యాల వైపు చేరుకోవాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, పాడి పంటలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఇప్పటికే ప్రజాపాలన ద్వారా ప్రజల విశ్వసనీయత పొందిన సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మరింత మెరుగైన పాలన అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు, పార్టీ శ్రేణులు నియోజక వర్గ ఇన్‌చార్జీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి నుంచి ఖైదీ పరార్


● గాలిస్తున్న మావల పోలీసులు

మావల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రిమ్స్ సూపర్ స్పెషాల్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న ఓ ఖైదీ పరారైన ఘటన ఆదిలాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం నిర్మల్ జిల్లా ఖానాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సూర్జపూర్ గ్రామానికి చెందిన కొమ్ము ఆకాష్ (19) పోక్సోకేసులో నిందితుడిగా ఉన్నారు. అయితే ఆరోగ్యం బాగలేక వైద్యం కోసం నిర్మల్ జిల్లా జైలు నుంచి గత నెల 27న ఆదిలాబాద్ రిమ్స్ సూపర్ స్పెషల్ ఆసుపత్రిలో చేరాడు. కాగా వైద్య చికిత్స పొందుతుండగా బుధవారం తెల్లవారుజామున ఆసుపత్రి నుంచి పరారయ్యాడు. ఈ మేరకు మావల పోలీ సులు కేసు నమోదు చేసుకుని గాలిస్తున్నామని ఎస్సై తెలిపారు.

బోథ్ బస్టాండ్‌లో బైక్‌పై వచ్చి సెల్‌ఫోన్ చోరీ

బోథ్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బస్టాండ్‌లో నిగిని గ్రామానికి చెందిన బాపూరావు అనేవ్యక్తి నుంచి దుండగులు సెల్‌ఫోన్ లాక్కొని పరారీ అయ్యారు. బస్టాండ్‌లో అందరు చూస్తుండగానే నెంబర్ లేని బైక్ పై వచ్చిన ఇద్దరు యువకులు బాపూరావు చేతిలో నుంచి సెల్‌ఫోన్ బలవంతంగా లాక్కొని పరారీ అయ్యారు. మోటార్ సైకిల్‌పై వచ్చిన వీరు కొద్దిసేపు బస్టాండ్‌లో అటు ఇటు తిరిగి సెల్‌ఫోన్ లాక్కొని పరారీ అయినట్లు బాధితుడు తెలిపారు. వ్యక్తుల వద్ద గొడ్డలి ఉందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తానని తెలిపాడు.

ఇటుక బట్టీ కార్మికులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లను అందజేస్తున్న ప్రతినిధులు

భైంసా, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఇటుక బట్టీ కార్మికులకు సత్యసాయి సేవా సమితి దుప్పట్ల పంపిణీ చేపట్టింది. సత్యసాయి యువజనసేవా సమితి జిల్లా విభాగం భైంసా మండలంలోని వానల్‌పాడ్ గ్రామ పరిసర ప్రాంతాల్లోని ఇటుక బట్టీ కార్మికులకు దుప్పట్లను పంపిణీ చేసింది. సత్యసాయి సేవా సమితి నిర్మల్ జిల్లా అధ్యక్షుడు భీంసేన్, మహిళా విభాగం అధ్యక్షురాలు సుజాత, యువజన సేవా సమితి జిల్లా మహిళాఅధ్యక్షురాలు స్వప్న, భైంసా డివిజన్ ప్రతినిధులు శ్రీనివాస రాజు (ట్రాన్స్‌కో), శ్రీనివాస్(ఎన్‌సీసీ), సూరిబాబు(పేయింటర్), ఎం.శ్రీనివాసరాజు, శ్రీధర్ గౌడ్, సాయినాథ్ యాదవ్, భగవాన్ సింగ్, గోపి, ప్రదీప్‌లు దుప్పట్ల పంపిణీని చేపట్టారు. వానల్‌పాడ్ గ్రామ శివారులోని ఇటుక బట్టీ వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి దుప్పట్ల పంపిణీ నిర్వహించారు.

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

ఉట్నూర్, జనవరి1 (ఆంధ్రజ్యోతి):ఉట్నూర్ మండల కేంద్రంలో నిర్మించిన హరిహర క్షేత్రం అయ్యప్ప ఆలయం 9వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహ కులురాథోడ్ భీమ్‌రావు, ఆడే ధన్‌లాల్‌నాయక్, తొగిటినాగ భూషణం, గుర్రం శ్రీనివాస్, తిరుపతిరెడ్డిలతో పాటు అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో వార్షికోత్సవ పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో హోమం గుండాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. హోమం పూజలను వేదాంత పండితులు రజిని శర్మ, దీపక్‌శర్మలక ఆధ్వర్యంలో నిర్వహించారు. రాత్రికి పడిపూజ నిర్వహిస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా, ఆమె శ్రీవారు ఆసిఫాబాద్ అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి, అత్తమామలతో కలిసి ఉట్నూర్‌లోని అయ్యప్ప ఆలయాన్ని సందర్శించారు. అనంతరం అయ్యప్ప



ఉట్నూర్‌లో హోమంలో పాల్గొన్న భక్తులు

క్షేత్రంలో పీఓ దంపతులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ దంపతులతో పాటు అత్తమామలను ఆలయ నిర్వాహకులు సన్మానించారు. అనంతరం పక్కనే ఉన్న హనుమాన్ మందిరంలో పూజారి బాలాజిద ఉబే ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. 2024కు వీడ్కొలు పలికి 2025 నూతన సంవ త్సరంలోకి అడు గుపెట్టినందున ఆలయాలు సందర్శించి పూజలు చేశానని, ఈ సంవత్సరం కూడా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

అయ్యప్ప పల్లకి ఊరేగింపు

బోథ్: మండలంలోని సోనాలలో బుధవా రం అయ్యప్ప పల్లకి ఊరేగింపుతో పాటు పడి పూజ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఉదయం ఏడు గంటలకి పల్లకి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు పల్లకి రాకను మంగళ హారతులతో స్వాగతించారు. అనంతరం మండల కేంద్రంలోని రామాలయంలో



అయ్యప్ప పల్లకి ముందు నృత్యాలు చేస్తున్న స్వాములు

అయ్య ప్ప పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయ్యప్ప స్వామి కీర్తనలతో రామాలయం మారు మోగింది. కౌటా(బీ), నేరగొండ గ్రామాలకు చెందిన బద్దం ప్రభాకర్ రెడ్డి భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు, మాజీ ఎంపీపీ తుల‌శ్రీనివాస్ రామాలయ కమిటీ అధ్యక్షులు జి.వి. రమణ, మాజీ సర్పంచ్ చెట్లపల్లి సదానందం పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు కృషి : పీహెచ్‌వో

ఉట్నూర్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సాగులో లేని రైతుల పొలాలలో సోలార్ పవర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసి తద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులు ఆర్థికంగా అభివృద్ధి సంధించడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యానవన అధికారి (పీహెచ్‌వో) గుడిమళ్ల సందీప్‌కుమార్ అన్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఆదేశాలతో బుధవారం ఉట్నూర్ మండలంలోని పలు గ్రామాలను సందీప్‌కుమార్ సందర్శించి అక్కడి రైతులతో సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించిన సాధ్యసాధ్యాలను పరిశీలించి రైతుల నుంచి సలహాలు, సూచనలు సేకరించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ఉద్యాన అధికారి గుడిమల్ల సందీప్‌కుమార్ మాట్లాడుతూ రైతుల అభిప్రాయాలు స్వీకరించి ప్రాజెక్టు అధికారి ద్వారా ప్రభుత్వానికి నివేదిక సమర్పించడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని చింతకర్ర, సాలెవాడ, పులిమడుగు, శాంపూర్, వడగల్పూర్ గ్రామాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో నియమ నిబంధనలు వచ్చిన తర్వాత మరో



రైతులతో మాట్లాడుతున్న పీహెచ్‌వో సందీప్

సారి ఆసక్తి కలిగినటువంటి రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌స్వామి, మండల వ్యవసాయ అధికారి రమేష్, ఐటీడీఏ డిప్యూటీ తహసీల్దార్ సోరాజి, ఉద్యాన నర్సరీ టెక్నికల్ అసిస్టెంట్ కుమారి అర్షిత, వ్యవసాయ విస్తరణ అధికారులు, విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫీతో సమగ్రశిక్షా ఉద్యోగుల నిరసన

ఆదిలాబాద్ రూరల్, జనవరి 01 (ఆంధ్ర జ్యోతి) : సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపడుతున్న సమ్మెను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తే సహించేది లేదని ఆదిలాబాద్ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం సభ్యులు పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సమగ్ర ఉద్యోగులకు ఇచ్చిన గ్యారెంటీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బుధ వారం సెల్ఫీ విత్ సీఎం కార్యక్రమాన్ని ఉద్యోగు లు చేపట్టారు. సీఎం ఫ్లెక్సీతో ఉద్యోగులు సెల్ఫీ లు తీసుకున్నారు. ప్రభుత్వం వెంటనే సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్షా ఉద్యోగులు పాల్గొన్నారు.



సెల్ఫీదిగుతూ నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

భీమాకోరేగావ్ అమరులకు నివాళి

ఆదిలాబాద్‌అర్బన్, జనవరి1 (ఆంధ్రజ్యోతి):భీమా కోరేగావ్ యుద్ధంలో అమరులైన 22 మంది మహార్ సైనికుల ధైర్య సాహసాల గురించి దేశం గర్వంగా చెప్పుకుంటున్నదని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లి ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం భుక్తాపూర్‌లోని అశోక్ బుద్ధ విహార్‌లో జరిగిన భీమా కోరేగావ్ 206వ శౌర్యదివాస్‌మాన్ వందన కార్యక్రమానికి కంది‌శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అనంతరం అమరుల స్థూపంవద్ద అంబేద్కర్ బుద్ధుని చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వక్తరెంజర్ల రాజేశ్, ప్రజ్ఞకుమార్, సోగలసుదర్శన్, దిగంబర్‌కాంబ్లె,రాజుమాస్కే,రాజుపాఠడే, ఉదయ్ కుమార్ ఝాడే, రాహుల్‌తాడే, ప్రమోద్‌మూడే, జైనథ్ మార్కెట్ కమిటీ అల్లూరి అశోక్‌రెడ్డి, జహీర్‌రంజాని, మేకల మధుకర్, దేరాకృష్ణారెడ్డి, అడ్డిరూకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక వేత్త మురళీధర్ రెడ్డికి పాకాల శుభాకాంక్షలు



మురళీధర్ రెడ్డిని సన్మానిస్తున్న పాకాల

నిర్మల్ కల్చరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : పాకాల ఫౌండేషన్ చైర్మన్, ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాకాల రాంచందర్ బుధవారం ప్రముఖ పారిశ్రామిక వేత్త అల్లోల మురళీధర్ రెడ్డిని కలిసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మురళీధర్ రెడ్డి దంపతులను ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్చం అందజేశారు. శాలువాతో సన్మానించారు. అల్లోల సురేందర్ రెడ్డి, మహేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దేశ సైనికుడికి ఘన స్వాగతం

లక్ష్మణచాంద, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మన దేశానికి సైనికుడిగా (సుబేదార్‌గా) సేవలందించిన పదవి విరమణ పొందిన సైనికుడు వంగ రాజు గౌడ్‌కు తన స్వగ్రామమైన పార్‌పెల్లిలో బుధవారం ఘన స్వాగతం లభించింది. ఇదే గ్రామానికి చెందిన ఆర్మీ, నేవీ బృందం, స్థానిక యువకులు బైక్ ర్యాలీ నిర్వహిస్తూ రాజు గౌడ్ దంపతులను, కుటుంబ సభ్యులను మహీంద్రా థార్ వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. స్థానికంగా గల అంబేద్కర్ విగ్రహానికి సెల్యూట్ చేసి ర్యాలీ ముగించారు. అనంతరం పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ అరుదైన గౌరవం పట్ల పలువురు సంతోషం వ్యక్తం చేశారు.

క్రికెట్ కిట్ అందజేత

ఆదిలాబాద్ రూరల్, జనవరి 01 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాంద(టి) గ్రామ సమీపంలో ఏపీఎల్ టోర్నమెంట్ క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. నాణక్య ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ మహమ్మద్ అమరుద్దీన్ న్యూ స్టార్ క్రికెట్ టీమ్‌కు రూ.25 ఖరీదు చేసే బాస్ బ్యాట్‌ని స్పాన్సర్ చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ప్రశంసించారు. క్రీడాకారులు క్రీడల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీమ్ కోచ్ అతావుల్లా, టీమ్ కెప్టెన్ అలీమ్, చాణక్య స్కూల్ పీఈటీ కృష్ణ చైతన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సెల్ టవర్ పనులను ప్రారంభించండి

బోథ్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వర్జర్ కేశవ్ కూడా ఆదివాసి గ్రామంలో నిర్వహించ తలపెట్టిన బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ పనులు అర్ధాంతరంగా నిలిపివేశారని సత్వరమే సెల్ టవర్ పనులను ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ సోనాల పట్టణ అధ్యక్షులు చెర్లపల్లి అనిల్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ రమేష్ బత్తుల, మార్కెట్ కమిటీ డైరెక్టర్ విశ్వరూపటేళ్ళ కోరారు. టవర్ నిర్మాణం పూర్తయితే ఆదివాసి గ్రామాలలో బిఎస్ఎన్ఎల్ సిగ్నల్‌తో సెల్‌ఫోన్ వినియోగించే అవకాశం ఉందన్నారు వినతి పత్రం ఇచ్చిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకులున్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం

● మాజీ మంత్రి జోగురామన్న

ఆదిలాబాద్‌అర్బన్, జనవరి1 (ఆంధ్రజ్యోతి):విశ్రాంత ఉద్యోగుల సమస్యల పై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. బుధవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగులను శాలువాతో సత్కరించారు. అనంతరం తెలంగాణ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జోగురామన్న మాట్లాడుతూ వివిధ శాఖల్లో పని చేసి విశ్రాంతి పొందిన వారిని సత్కరించడం జరిగిందన్నారు.విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. పీఆర్సీ, వెల్‌నెస్ సెంటర్‌లో చికిత్సలతో పాటు నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పై ప్రభుత్వం దృష్టి సారించాలని పేర్కొన్నారు. ముందుగా గజిటెడ్ ఉపాధ్యాయ సంఘాలు జోగురామన్నను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.శశికాంత్, కార్యదర్శి జగన్ మోహన్, గౌరవ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, పురుషోత్తం, మస్తన్, జిలాని, అశోక్ వైద్య తదితరులు పాల్గొన్నారు.

బీమా కోరేగావ్ స్ఫూర్తితో పోరాడుదాం

ఇంద్రవెల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): దళితుల హక్కుల కోసం నిరంతరం భీమా కోరేగావ్ స్ఫూర్తితో పోరాడుదామని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్ కాంబ్లే మనోహర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీమా కోరేగావ్ 207 శౌర్య దివస్‌ని పురస్కరించుకుని అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్, భీం ఆర్మీ, దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో భీమాకోరేగావ్ శౌర్య దివస్‌ను ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అక్కడే ఏర్పాటు చేసిన భీమా కోరేగావ్‌లో 1818 జనవరి 1న జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన అమరులైన మహార్ సైనికుల అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. అనంతరం బుద్ధ, దమ్మ సంఘం వందన తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీష్వాపై మహార్ పోరాట యోధుల యుద్ధ విజయానికి చిహ్నమే భీమాకోరేగావ్ 500 మంది మహార్ వీరులు, 28వేల మంది పీష్వా బ్రాహ్మణ సైన్యంతో మహారాష్ట్ర కోరేగావ్‌లో భీమా నది వద్ద భీకర యుద్ధం చేసి విజయం సాధంచారని వివరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వాగ్మారే కామరాజ్, భీం ఆర్మీ ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు పరత్యాగ్ పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చే వరకు నిరవధిక సమ్మెను చేపడతాం

● సివిల్ సప్లయ్ మండల అధ్యక్షులు పొచ్చన్న

జైనథ్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం సివిల్ సప్లయి హమాలీల డిమాండ్‌లు నేరవేర్చే వరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందని సివిల్ సప్లయ్ హమీలీల సంఘం జైనథ్ మండల అధ్యక్షులు ఈర్గల పొచ్చన్న అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సివిల్ సప్లయి హమాలీలతో రాష్ట్ర కమిషనర్ ఒప్పుకున్న రేట్లను జీవో ప్రకారంగా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు హమాలీ కార్మికులకు స్వీపర్లకు రూ.10లక్షల ఆరోగ్య బీమాను అమలు చేయాలని అన్నారు. లేని పక్షంలో హమాలీ కార్మికుల డిమాండ్‌లను నేరవేర్చేంత వరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సివిల్‌సప్లయి హమాలీల సంఘం జైనథ్ మండల ప్రధాన కార్యదర్శి కొవగోవింద్, హమాలీ కార్మికులు హమాలీలు సివిల్ సప్లయి గోదాం సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు



బీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎంపీటీసీ మహేష్ రెడ్డి

నిర్మల్ రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో బుధవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీజేపీకి చెందిన మాజీ ఎంపీటీసీ మహేష్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు అసెంబ్లీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లోలం శ్యాంసుందర్, కే. కిరణ్, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

తానూర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భోసి గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు బామన్ రామవులు ఇటీవల మృతి చెందగా, బుధవారం ఐక్యత సేవా సమితి ఆధ్వర్యంలో భైంసా పట్టణంలోని కిషన్ గల్లికి చెందిన కసరొల్ల నర్సయ్య నిత్యవసర సరుకుల కోసం రూ. 4వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబమని ప్రభుత్వం తరుపున కూడా ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఐక్యత సేవా సమితి సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హామీతో దీక్షను విరమించిన కొత్తూరి శంకర్

కుభీర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : కుభీర్ మార్కెట్‌కమిటీ చైర్మన్ పదవిని వెంటనే నియమించాలని గత మూడు రోజులుగా దీక్ష చేపడుతున్న దళిత సంఘ నాయకుడు కొత్తూరు శంకర్ బుధవారం దీక్ష విరమణ చేశారు. పది రోజులలో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని భర్తీ చేసే విధంగా బాధ్యత తీసుకుంటామని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇచ్చిన హామీతో దీక్షను విరమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్ చంద్రే, బంకబాబు, బషీర్, తదితరులున్నారు.

నిరుపేదలకు దుప్పట్ల అందజేత

లోకేశ్వరం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కోస్లి వెంకట్ రావు కుమారుడు కోస్లి వికాస్ రావు పుట్టిన రోజు సందర్భంగా వారి ఆర్థిక సహాయంతో ఆర్మూర్ పట్టణంలో అక్కడక్కడ చలిలో నివసిస్తున్న నిరుపేదలకు, అభాగ్యులకు, ఏ ఆదరణ లేకుండా చెట్టు కింద తాత్కాలిక ఆవాసం ఏర్పరచుకొని నివసిస్తున్న యాచకుల మధ్య కేక్ కట్ చేసి దాదాపు 30 మందికి మా అమ్మానాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ ఎం. ఆంజనేయులు రగ్గుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మా అమ్మానాన్న ఫౌండేషన్ చైర్మన్ ఆంజనేయులు మాట్లాడుతూ... పుట్టిన రోజు సందర్భంగా ఎలాంటి ఆర్భాటాలకు వెళ్లకుండా డబ్బులు వృధా ఖర్చు చేయకుండా నిరుపేదలకు సహాయం చేయాలని కోరారు. రగ్గుల కోసం ఆర్థిక సహాయం చేసిన వెంకట్ రావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన శ్రీహరి రావు



నిర్మల్ అర్బన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు హైదరా బాద్‌లో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నిర్మల్ జిల్లా రాజకీయాలపై చర్చించారు.

ఆకతాయిల జ్యుడీషియల్ రిమాండ్

నిర్మల్ రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : గాంధీ విగ్రహాన్ని అవమానించిన ఆకతాయిలు 9 మంది ఉండగా, వారిలో నుండి 8 మంది పట్టుకున్నారు. అనంతపేటకు చెందిన రమణ, అమరనాథ్, అనిల్, అక్షయ్, వరుణ్, సాయితేజ, భీమేష్, నరేందర్ పట్టుకొని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక ఎస్సై లింబాద్రి తెలిపారు.

నాగదేవత ఆలయ విగ్రహ ధ్వంసంపై నిరసన

కుభీర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : భైంసా నుండి భోకర్ వెళ్లే రోడ్డు ప్రక్కన గల నాగదేవత ఆలయంలో గల నాగదేవతల విగ్రహాలను ధ్వంసం చేసి హుండి పగలకొట్టడంపై మండల కేంద్రం కుభీర్‌లో బుధవారం మండల హిందుధర్మ పరిరక్షణ సమితి తీవ్రంగా ఖండిస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా హిందుధర్మ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు బోయిడి అభిషేక్‌మాట్లాడుతూ ఈ ఘటనలో బాధ్యులను వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హిందువాహిని కుభీర్ అధ్యక్షుడు నాగభూషణం, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పడిపెల్లి గంగాధర్, మండల బీజేపీ అధ్యక్షులు ఏశాల దత్తాత్రి, హిందుసంఘాల నాయకులు పాల్గొన్నారు.

కిన్వట్ మాజీ ఎమ్మెల్యే మృతికి నివాళి

ఆదిలాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర కిన్వట్ మాజీ ఎమ్మెల్యే ప్రదీప్‌నాయక్ బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచుశ్రీకాంత్‌రెడ్డి కిన్వాట్ తాలుకా దహేలితండాలోని వారి నివాసానికి వెళ్లి ప్రదీప్‌నాయక్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రదీప్‌నాయక్ ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థించారు. ఎమ్మెల్యేగా కిన్వట్ నియోజక వర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టి ప్రజా నాయకుడిగా పేరుపొందారన్నారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని శ్రీకాంత్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దామోదర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వాభిమాన పోరాటాలకు భీమా కోరేగావ్ స్ఫూర్తి

నార్నూర్, జనవరి1 (ఆంధ్రజ్యోతి):మహా పోరాట యోదుల యుద్ధ విజయానికి చిహ్నమే భీమా కోరేగావ్ అని స్థానిక మాజీ సర్పంచ్ బి.గజానందనాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మహానాయకుడు భీమా కోరేగావ్ విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గజానందునాయక్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బాలాజి కాంబ్లి బ్రిజలాల్ దేవరావు, చంద్రశేఖర్, లోకండే, జాడినాందేవ్, కేశవ్‌దురే, మహిళలున్నారు.

ఫటా..ఫట్...

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

● 'ఆంధ్రజ్యోతి'తో ముథోల్ ఎస్సై కే.సంజీవ్ కుమార్



ఆంధ్రజ్యోతి: మండలంలోని శాంతి భద్రతల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై: ముథోల్ పరిధిలోని శాంతిభద్రతల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడ ఏ చిన్న ఘటన జరిగిన వెంటనే అలర్ట్ అవుతున్నాం. మునుముందు కూడా ఎవరైనా శాంతిభద్రతకు విఘాతం కలిగిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు.

ఆంధ్రజ్యోతి: రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఎస్సై: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిరోజు వాహనాలు తనిఖీ చేస్తున్నాం. ఎవరైనా సంబంధిత పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటున్నాం. అలాగే కెపాసిటీకి మంచి వాహనాలలో ప్రయాణికులను తీసుకెళ్లడం, ద్విచక్ర వాహనంపై త్రీ రైడింగ్, ఫోర్ రైడింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అలాగే ఈ రోడ్డు ప్రమాదాల నివారణకై అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: యువత చెడు వ్యసనాలకు గురికాకుండా ఉండేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఎస్సై: యువత చెడు వ్యసనాలకు గురికాకుండా ఉండేందుకు యువతకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. గంజాయి, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు, మద్యం వంటి చెడు వ్యసనాలు తీసుకోవడం వల్ల ఏర్పడే ఆరోగ్య సమస్యలు, ఇబ్బందులు, వారి కుటుంబ పరిస్థితుల గురించి వివరిస్తున్నాం. అంతేకాకుండా యువత చెడు వ్యసనాలకు దూరం ఉంటూ సన్మార్గంలో పయనించాలని వివరిస్తున్నాం.

● (ఆంధ్రజ్యోతి, ముథోల్)

జోరుగా కల్తీ నూనెల విక్రయాలు!

● కామారెడ్డి, డిచ్‌పల్లి మీదుగా సరఫరా ● నియోజకవర్గంలోని కిరాణా షాపులలో దర్శనమిస్తున్న వివిధ రకాల వంట నూనెలు ● జోరుగా సాగుతున్న కల్తీ నూనెల దందా

బోథ్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలో కల్తీ నూనెల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కల్తీ నూనెలు డిచ్‌పల్లి, కామారెడ్డిజిల్లాల నుండి సరఫరా అవుతుంది. అయితే బోథ్ నియోజకవర్గ పరిధిలోని నేరడిగొండ, బోథ్, సోనాల, ఇచ్చోడ, బజార్హత్నూర్ మండలాలకు కల్తీ నూనెల దందా దర్జాగా జరుగుతుంది. ఆయా మండల కేంద్రాలకు ఒరిజినల్ నూనె డబ్బాలను తీసుకువచ్చే వాహనాలలో కల్తీ నూనెలను తీసుకువస్తున్నారు. కొంతమంది వ్యాపారులు కల్తీ నూనెల వ్యాపారితో చేతులు కలిపి నాసిరకమైన నూనె విక్రయిస్తున్నారు.

స్పెల్లింగ్ మిస్టేక్‌లతో నూనె డబ్బాలు

ఒరిజినల్ నూనె పాకెట్లను డబ్బాలను పోలిన విధంగానే కనిపించే నూనె పాకెట్లు డబ్బాలపైన స్పెల్లింగ్ మిస్టేక్‌లతో నూనె విక్రయిస్తున్నారు. దీంతో చదువుకున్న వారు సైతం ఒరిజినల్ నూనె డబ్బాలుగానే భావించి తీసుకు వెళుతున్నారు. మారుమూల గిరిజన గ్రామాల ప్రజలకు ఈ నూనెను అంటగడుతున్నారు. దీంతో నూనెను వాడిన ప్రజలకు పలు రకాల వ్యాధులు సోకే ఆస్కారం ఉందని వైద్యులు అంటున్నారు.

చోద్యం చూస్తున్న అధికారులు

కల్తీ నూనెల విక్రయాలను అరికట్టాల్సిన అధికార యంత్రాంగం ఈ విషయాన్ని చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. బహిరంగంగానే పలువురు వ్యాపారులు కల్తీ నూనెలను విక్రయిస్తున్న అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. పండుగ సీజన్‌లో కల్తీ నూనెల విక్రయాల జోరు అధికంగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

జీరో పన్నుతో నూనెల సరఫరా..

కల్తీ నూనెలను జీరోలో ఎలాంటి పన్నులు కట్టకుండా జీఎస్టీ చెల్లించకుండా తీసుకువస్తున్నారు. దీంతో కల్తీ నూనెల విక్రయాలు వ్యాపారులకు కల్పతరువుగా మారడంతో కొంతమంది గ్రామీణ ప్రాంత ప్రజలకు ఒప్పించి మెప్పించి విక్రయిస్తున్నారు.


సోనాలలోని కిరాణా షాప్‌లో డబ్బాలలో విక్రయిస్తున్న నూనె


● తయారీ ఎక్కడో తెలియదు కొత్త కొత్త పేర్లతో బోథ్ సంతలో అమ్ముతున్న నూనె ప్యాకెట్లు

హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో..

భైంసా బంద్ విజయవంతం

●వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సమితి శ్రేణుల నిరసన ప్రదర్శనలు ● నాగదేవత ఆలయ ఘటనలోని దొంగలను సత్వరమే పట్టుకోవాలని డిమాండ్ ● ఆలయాల్లో చోరీల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఏఎస్పీకి వినతి

భైంసా, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో చోటు చేసుకుంటున్న వరుస చోరీ ఘటనలను నిరసిస్తూ హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన భైంసా బంద్ విజయవంతమయ్యింది. ఒక వర్గానికి చెందిన వర్తక,వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా బంద్‌ను పాటించాయి. బంద్ కారణంగా నిత్యం క్రయ, విక్రయాలతో సందడిగా కనిపించే రోడ్లు బోసిపోయి కనిపించాయి. కొనుగోలుదారులతో కళకళలాడే దుకాణ సముదాయలు వెలవెలబోయాయి. ఈ సందర్భంగా హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి శ్రేణులు స్థానిక పద్మావతి కాలనీ పరిధిలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో భేటి అయ్యారు. ఇందులో పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ చోరీల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టకపోవడం మూలంగానే వరుస ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు. ఇదే క్రమంలో చోరీలకు పాల్పడిన దొంగలను పట్టుకోవడంలో పోలీసుశాఖ వైఫల్యం చెందుతోందని విమర్శించారు. పోలీసు శాఖ ఇకనైనా ఆలయాల్లో చోరీల కట్టడికి, దొంగలను పట్టుకునేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కార్యచరణ ప్రణాళిక రూపొందించి ఆందోళనలను తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం పలువురు ప్రతినిధులతో కూడిన బృందం ఎస్‌డీపీవో కార్యాలయానికి వెళ్లి సంబంధిత విషయంలో ఏఎస్పీ అవినాష్ కుమార్‌కు వినతి పత్రం అందచేశారు. ఇందుకు స్పందించిన ఏఎస్పీ అవినాష్ కుమార్ మాట్లాడుతూ ప్రణాళికబద్ధమైన విధానాలతో, పకడ్బందీ చర్యలతో ఆలయాల్లో చోరీ ఘటనలు చోటు చేసుకోకుండా చూస్తామని వెల్లడించారు. నాగదేవత ఆలయంలో చోరీకి పాల్పడిన దొంగలను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. క్లూస్ టీం సేకరించిన ఆధారంగా అనుమానితులను గుర్తించామని తెలిపారు.

భారీ బందోబస్తు

హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కొనసాగిన భైంసా బంద్‌కు పోలీసు శాఖ భారీ బందోబస్తు చేపట్టింది. ఏఎస్పీ అవినాష్ కుమార్ నేతృత్వంలో టౌన్ సీఐ గోపినాథ్ భద్రత చర్యలు చేపట్టారు. ఇందులో డివిజన్ పరిధిలోని వివిధ పోలీసు స్టేషన్ల ఎస్‌ఐ, సిబ్బంది పాల్గొన్నారు. ప్రధాన కూడలీలతో పాటు వివాదస్పద, సమస్యాత్మక ప్రాంతాల్లో పికెటింగ్‌లు ఏర్పాటు చేశారు. ఏఎస్పీ అవినాష్ కుమార్ పలు దఫాలుగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి బందోబస్తును పర్యవేక్షించారు.

నాగదేవత ఆలయాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ బుధవారం చోరి ఘటన చోటు చేసుకున్న నాగదేవత ఆలయాన్ని పరిశీలించారు. పార్టీ ప్రతినిధులు ఎనుపోతుల మల్లేశ్వర్, సుష్మారెడ్డి, గుంటూర్ శంకర్, కె.శంకర్‌తో పాటు పలువురు ప్రతినిదులతో కలిసి వెళ్లి పరిశీలనలు చేపట్టారు. ఆలయ నిర్వాహకులతో మాట్లాడి చోరి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆలయంలో ధ్వంసమైన భాగాలను పరిశీలించారు.


భైంసాలో మూసి ఉన్న దుకాణ సముదాయం


భైంసాలో బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఏఎస్పీ అవినాష్ కుమార్

అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడం వల్లనే..

: బోస్లే మోహన్‌రావు పాటిల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

ముథోల్ నియోజకవర్గ పరిధిలో అధికారులు, పాలకులు పట్టించుకోక పోవడం మూలంగానే ఆలయాల్లో వరుస ఘటనలు చోటు చేసుకుంటున్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోస్లే మోహన్‌రావ్ పాటిల్ ఆరోపించారు. ఈ విషయమై ఆయన బుధవారం పత్రికా ప్రకటనను విడుదల చేశారు. వరుస ఘటనల కట్టడికి అధికారులు, పాలకులు బాధ్యతాయుతంగా వ్యవహరించి పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. ఇదే క్రమంలో ఆలయాలన్నింటిలోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇక నుంచి హిందూ దేవాలయాల్లో చోరీలు, దాడులు, ధ్వంసాలు జరిగితే సహించబోమని, ఇది వరకు జరిగిన ఘటనల్లోని దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని పేర్కొన్నారు.


భైంసాలో నిరసన ప్రదర్శనలు చేపడుతున్న హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ప్రతినిధులు


ఏఎస్పీకి వినతిపత్రం అందచేస్తున్న హిందూ దేవాలయాల పరిరక్షణ ప్రతినిధులు

సంస్థాగత ఎన్నికలపై దృష్టి

● బీజేపీలో పూర్తయిన బూత్ కమిటీ ఎన్నికలు
● ఈనెల మొదటి వారంలో మండల కమిటీలు
● రెండవ వారంలో జిల్లా కమిటీ ఎన్నికలు
● పర్యవేక్షణకు మండలాల వారీగా పరిశీలకులు

భైంసా, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పార్టీని పటిష్టపరచే చర్యల్లో భాగంగా బీజేపీ సంస్థాగత ఎన్నికలపై దృష్టి సారించింది. ప్రణాళికాబద్ధమైన విధానాల ద్వారా బూత్ కమిటీలు, అటు తరువాత మండల, జిల్లా కమిటీల ఎన్నికల నిర్వాహణకు చర్యలు చేపట్టింది. పకడ్బందీ విధానాల ద్వారా ఇప్పటికే లక్ష్యం మేర పార్టీ సభ్యత్వ సేకరణను పూర్తి చేసుకున్న పార్టీ ప్రతినిధులు ప్రస్తుతం సంస్థాగత కమిటీల నియమాకాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రక్రియలో నిమగ్నమయ్యారు. అధిష్టానం ఆదేశాలకు అనుగుణంగా సంస్థాగత ఎన్నికల నిర్వాహణలో తలమునకలయ్యారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంజుకుమార్ రెడ్డి, పైడిపెల్లి గంగాధర్‌లతో పాటు జిల్లాలోని మూడు నియోజక వర్గాల పార్టీ కన్వీనర్లు సంస్థాగత ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు గాను పకడ్బందీగా ముందుకు సాగుతున్నారు. జిల్లాలోని పార్టీకి చెందిన నిర్మల్, ముథోల్ నియోజక వర్గాల ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పవార్ రామరావ్ పాటిల్‌లు సైతం సంస్థాగత ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వాహణ ప్రక్రియకు బాధ్యతాయుత భాగస్వామ్యాన్ని అందిస్తున్నారు. ఆశావాహుల చర్యలతో బీజేపీలో సంస్థాగత ఎన్నికల సందడి జోరందుకుంది.

బూత్ కమిటీల ఎన్నికల పూర్తి

బీజేపీ పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా తొలి ఘట్టంగా బూత్ కమిటీల ఎన్నికలకు శ్రీకారం చుట్టింది. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో గల 925 బూత్‌లకు కమిటీల ఎన్నికలను నిర్వహిస్తోంది. మూడు నియోజక వర్గాల పరిధిలో 24 మండలాలు ఉండగా పార్టీ అధిష్టానం విధించిన గడువు మంగళవారం అన్ని మండలాల్లో బూత్ కమిటీల ఎన్నికలు పూర్తయ్యాయి.

మండల, జిల్లా కమిటీల ఎన్నికలు

బూత్ కమిటీల ఎన్నికలను పూర్తి చేసుకుంటున్న కమలనాథులు ఈ నెలలో మండల, జిల్లా కమిటీల ఎన్నికలను నిర్వహించుకునేందుకు గాను కార్యచరణ ప్రణాళిక రూపొందించారు. మొదటివారం మండల కమిటీలు, రెండవ వారంలో జిల్లా కమిటీల ఎన్నికల నిర్వాహణ పూర్తి చేసేందుకు గాను చర్యలు చేపట్టారు. బీజేపీ అధిష్టానం తీసుకున్న నిర్ణయం మేరకు ఉమ్మడి జిల్లా పరిధిలోని 24 మండలాలను నిర్మల్ జిల్లాకు కేటాయించారు. సంబంధిత మండలాలన్నింటిలోనూ బూత్ కమిటీల ఎన్నికలను పూర్తి చేసిన జిల్లా పార్టీ బాధ్యులు ప్రస్తుతం మండల కమిటీల ఎన్నికలపై దృష్టి సారించింది. కమిటీల ఎన్నికలు ఆద్యాంతం సజావుగా కొనసాగించేందుకు పార్టీ బాధ్యులు పకడ్బందీ విధానాలతో ముందుకు సాగుతున్నారు.

ఎన్నికల పర్యవేక్షణకు పరిశీలకుల నియామకం

పార్టీ అధిష్టానం మండల, జిల్లా కమిటీల ఎన్నికలను పారదర్శకంగా చేపట్టేందుకు గాను చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతీ మండలానికి ఒక పరిశీలకుడిని నియమించింది. సంబంధిత పరిశీలకుని పర్యవేక్షణలో పార్టీ మండల కమిటీల ఎన్నికలు జరుగనున్నాయి. పరిశీలకులు ఆయా మండలాల పార్టీ ప్రతినిధులు, బాధ్యులు, ప్రధాన నాయకుల అభిప్రాయాలకు సేకరించి, సూచనలను పరిగణలోకి తీసుకొని మండల కమిటీ ఎన్నికలను చేపట్టనున్నారు. మండల పార్టీ సూచించిన పేర్లను పరిశీలకులు జిల్లా కమిటీకి నివేదించనున్నారు. అక్కడ కోర్ కమిటీలో సంబంధిత పేర్లను పరిశీలించి ఏకాభిప్రాయం తీసుకొని అనుమతి నిమిత్తం రాష్ట్ర కమిటీకి నివేదించిన తర్వాత మండల కమిటీల ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత జిల్లా కమిటీ ఎన్నిక చేపట్టనున్నారు.

గాడ్‌ఫాదర్ల చుట్టూ ఆశావహుల చక్కర్లు

మండల కమిటీ స్థానాలను ఆశిస్తున్న ఆశావాహులు పార్టీలోని తమ తమ గాడ్‌ఫాదర్ల చుట్టూ ప్రదక్షిణలు చేపడుతున్నారు. తమకు పార్టీ పదవి ఎలాగైనా కట్టబెట్టాలంటూ ఆశావాహులు గాడ్‌ఫాదర్లతో పాటు పార్టీ ప్రతినిధులపై ఒత్తిడి తీసుక వస్తున్నారు. జిల్లాలోని మూడు నియోజక వర్గాల పరిధిలో నిర్మల్, ముథోల్ నియోజక వర్గాలలో బీజేపీకి చెందిన ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పవార్ రామరావ్ పాటిల్‌లు ఉండటంతో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ పదవులకు డిమాండ్ పెరిగింది. ఆశావాహులు ఎక్కువ సంఖ్యలో ఉండటంతో పోటీ పెరిగింది.పదవులను ఆశిస్తున్న ఆశావహులు వాటిని దక్కించుకునేందుకు గాను ఎత్తుకుపై ఎత్తులతో, వ్యూహ, ప్రతి వ్యూహాలతో ముందుకు సాగుతున్నారు.

అధిష్ఠానం ఆదేశాలకు అనుగుణంగా..

: పైడిపెల్లి గంగాధర్, బీజేపీ ప్రధాన కార్యదర్శి, నిర్మల్

పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ఆద్యాంతం అధిష్ఠానం ఆదేశాలకు అనుగుణంగా నిర్వహిస్తున్నాం. బూత్ కమిటీల ఎన్నికలు పూర్తయ్యాయి. మండల కమిటీల ఎన్నికలు పరిశీలకుల పర్యవేక్షణలో సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టాం. అధిష్టానం విధించిన గడువులోగా సంస్థాగత ఎన్నికలను పూర్తి చేసుకుంటాం.

బాసరలో నూతన సందడి

● న్యూ ఇయర్ వేళ భక్తులతో కిటకిటలాడిన ఆలయం

బాసర, జనవరి 1(ఆంధ్రజ్యోతి): బాసర సరస్వతి అమ్మవారి సన్నిధి బుధవారం భక్తులతో కిటకిటలాడింది. ఆంగ్ల నూతన సంవత్సరం తొలిరోజు పురస్కరించుకొని అమ్మవారిని దర్శించుకునేందుకు భారీగా భక్తులు వచ్చారు. కొత్త ఏడాది అంతా బాగుండాలి అని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. పొరుగున మహారాష్ట్ర ప్రాంతం నుండి మరాఠీ భక్తులు సైతం ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు. గోదావరి నదిలో స్నానాలు ఆచరించి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కాగా, బాసర సరస్వతి అమ్మవారిని బుధవారం బీజేపీ ముథోల్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేలు రామరావు పటేల్, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా దర్శించుకున్నారు. అంతేకాకుండా ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేలకు ఆలయ పండితులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఎమ్మెల్యేలు పుణ్యక్షేత్రంలో ఒక కుల సంఘం భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.


అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యేలు రామరావు పటేల్, నిజామాబాద్ అర్బన్ ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త

గాంధీ విగ్రహానికి వినతి

నిర్మల్ కల్చరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) :సమగ్రశిక్షా ఉద్యోగులు బుధవారం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమను విద్యాశాఖలో విలీనం చేసి, క్రమ బద్ధీకరించాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో డిమాండ్ల సాధనకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మానవతా దృక్పథంతో వ్యవహరించి న్యాయం చేయాలన్నారు. టీపీటీఎఫ్ నాయకుడు ఏ.విజయ్ కుమార్ దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. డిమాండ్లు పరిష్కరించాలన్నారు.


చైల్డ్ ప్రొటెక్షన్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్ (ఫైల్)

యాచక వృత్తికి.. ఇక బ్రేక్!

- పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం
- భిక్షాటన అడ్డుకు ప్రత్యేక బృందాలు
- చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కార్యాచరణ అమలు
- భిక్షాటన సమస్యపై దృష్టి సారించిన కలెక్టర్

నిర్మల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భిక్షాటనకు ఇక బ్రేక్ పడనుంది. ఈ యాచక వృత్తిని జనవరి 1వ తేదీ నుంచి నిర్మల్ జిల్లాలో భిక్షాటనను పూర్తిగా నిషేధించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రకటించడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఈ మేరకు భిక్షాటన నిషేధ చట్టాన్ని జిల్లా వ్యాప్తంగా నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేసేందుకు నిర్ణయించారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆధ్వర్యంలో భిక్షాటన నిషేధంపై కార్యాచరణను రూపొందించారు. చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ అధికారులు, సిబ్బందితో ఇటీవలే జిల్లా కలెక్టర్ ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి యాక్షన్ ప్లాన్ అమలు కార్యాచరణపై చర్చించారు. గత కొంతకాలం నుంచి భిక్షాటన కారణంగా స్థానికులు, వాహన చోధకులు, వ్యాపారులు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని అధికారులు పరిగణనలోకి తీసుకున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు భైంసా, ఖానాపూర్ పట్టణాల్లో ప్రధాన కూడళ్లలో, దేవాలయాల్లో సైతం భిక్షాటన చేసే వారితో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న సంగతి తెలిసిందే. నిర్మల్ పట్టణంలోని మంచిర్యాల చౌరస్తా, కొత్త బస్టాండ్, శాంతినగర్ చౌరస్తా, ఈద్గాం చౌరస్తా తదితర ప్రాంతాల్లో భిక్షాటన చేసే వారి సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతోంది. భిక్షాటన చేసే వారితో కలుగుతున్న ఇబ్బందులపై జిల్లా కలెక్టర్‌కు ఇప్పటికే స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ ఫిర్యాదులపై స్పందించిన జిల్లా కలెక్టర్ జిల్లాలో భిక్షాటనను నిషేధించేందుకు రూపొందించిన చట్టాన్ని అమలు చేసేందుకు నిర్ణయించారు. దీనికి అనుగుణంగా చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ అధికారులకు ఈ బాధ్యతలను అప్పగించారు. ఇక నుంచి భిక్షాటనను ప్రోత్సహిస్తే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోనున్నారు.

పునరావాస కేంద్రాలకు తరలింపు

కాగా జిల్లాలో భిక్షాటన నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయబోతున్న కారణంగా ఇప్పటి వరకు భిక్షాటన చేస్తూ జీవిస్తున్న వారందరికీ పునరావాస కేంద్రాలకు తరలించనున్నారు. మొదలు ప్రధాన కూడళ్లలో భిక్షాటన చేస్తున్న వారందరిని గుర్తించి వారికి అవగాహన కల్పించడమే కాకుండా పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం కల్పించనున్నారు. ఇక్కడి వారందరికీపై శిక్షణలు కూడా అందించనున్నారు. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయంతో పాటు భోజన సౌకర్యం కూడా కల్పించనున్నారు. అలాగే స్వయం ఉపాది నైపుణ్యాభివృద్ధిపై శిక్షణలు కూడా ఇవ్వాలని నిర్ణయించారు. ఈ వ్యవహారంలో ప్రజల సహకారం కూడా తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు.

ప్రత్యేక బృందాల ఏర్పాటు

జిల్లాలో భిక్షాటనను పూర్తిగా నిషేధించేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. భిక్షాటనను పూర్తిగా అరికట్టేందుకు పోలీసుల సహకారం తప్పనిసరి అవసరమవుతుందని గుర్తించా రు. దీని కారణంగా ప్రధాన కూడళ్లలో భిక్షాటన చేస్తున్న వారిని మొదలు గుర్తించి జాబి తా రూపొందించనున్నారు. వారందరికీ కౌన్సెలింగ్ నిర్వహించి పునరావాస కేంద్రాలకు తరలించనున్నారు. దీంతో పాటు భిక్షాటనను ప్రోత్సహించే వారికి కూడా కౌన్సెలింగ్‌లు నిర్వహించడమే కాకుండా చట్టపరమైన అంశాలను వారికి వివరించి అనంతరం చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. కాగా పోలీసు టీం సభ్యులు భిక్షాటన నిరోధించే చర్యల్లో క్రియాశీల పాత్ర పోషించే విధంగా యాక్షన్ ప్లాన్ రూపొందించారు. ఈ యాక్షన్ ప్లాన్ కారణంగా కొద్ది రోజుల్లోనే నిర్మల్ జిల్లా వ్యాప్తంగా భిక్షాటన సమస్య పూర్తిగా అరికట్టబడనుందని అంటున్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ (ఫైల్)

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

● భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

భైంసా, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రమైన భైంసాలో మంగళవారం రాత్రి వేళ నుంచి ప్రారంభమైన నూతన సంవత్సర వేడుకలు బుధవారం వరకు ఘనంగా జరిగాయి. వేడుకలలో భాగంగా పలు కాలనీల్లో యువకులు, పలు కుటుంబాలసభ్యులు, సంఘాల ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని కేక్‌లను కట్ చేశారు. బుధవారం ఉదయం నుంచి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల కోలాహలంతో ఆలయాలు కిటకిటలాడాయి. మంగళవారం రాత్రి వేళలో పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ విందు, వినోద కార్యక్రమాలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లోని యువకులు సౌండ్ సిస్టమ్స్‌ను ఏర్పాటు చేసుకొని నృత్యాలు చేశారు. కొంత మంది తమ తమ కాంప్లెక్స్‌లలో సాముహిక భోజనాలు నిర్వహించి వేడుకలను ఆనందోత్స హాల మధ్య ఘనంగా నిర్వహించుకున్నారు. మహిళలు రంగురంగుల రంగవల్లులతో నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ ముగ్గులను వేశారు.

ముథోల్ : కొంగొత్త ఆశయాలతో మండల ప్రజలు ఆంగ్ల నూతన ఏడాదికి ఘనంగా స్వాగతం పలికారు. పాత ఆంగ్ల సంవత్సరం మిగిల్చిన జ్ఞాపకాలతో సరి కొత్త లక్ష్యాలతో కొత్త సంవత్సరంలోకి అడు గుపెట్టారు. చిన్నా పెద్ద అని తేడా లేకుండా ప్రజలంతా సంబురాల్లో మునిగిపోయారు. కొత్త ఏడాది అందరికీ శుభాలు కలగాలని ఆకాం క్షించారు. మండలంలోని ఆయా పల్లెల్లో యువత కేరింతలు కొట్టారు. 2024కి వీడ్కోలు... 2025కి వెల్‌కమ్ చెబుతూ ఆనంద డోలికల్లో తేలిపోయారు. 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ కేకలు వేస్తూ కేక్‌లు కట్ చేసి ఆట పాటలతో ఎంజాయ్ చేస్తూ కొత్త సంవత్సరాన్ని నిండు మనసుతో ఆహ్వానించారు. ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా మహి ళలు ఉత్సాహంగా ఇళ్ల ముందు వాకిళ్లను రంగు రంగుల ముగ్గుల తో అందంగా తీర్చిదిద్దారు. ఈ సంద ర్భంగా స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఒకరికొకరు శుభా కాంక్షలు తెలు పుకుంటూ మిఠాయిలు పంచుకు న్నారు.


భైంసాలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కుంటాల : మండలంలోని కల్లూరు సాయి బాబా ఆలయం లో బుధవారం భక్తజనం పోటె త్తింది. ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్క రించుకొని భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి పూజలు నిర్వహిం చారు. మధ్యాహ్న హారతి సమయంలో ఆలయ ప్రాంగణం భక్తజ నంతో కి క్కి రి సి పో యిం ది. ఆలయానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదానం, తాగునీరు ఏర్పాటు చేశారు.

సారంగాపూర్ : మండల కేంద్రంతో పాటు కౌట్ల(బీ), జామ్, మలక్ చించోలి, స్వర్ణ, ధని గ్రామాల ప్రజలు నూతన వస్త్రాలను ధరించి నూతన సంవత్సర సందర్భంగా బుధవారం అడెల్లి మహా పోచమ్మ ఆలయంలో భక్తులు చల్లంగా చూడు తల్లి అంటూ మొక్కులను మొక్కి సంవత్సరం పాటు ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మ వారిని వేడు కున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి శ్రీనివాస్ అమ్మవారికి హారతి ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం ఒక రికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలు పుకొని స్వీట్లను పంచి పెట్టుకున్నారు. దీంతో ఆలయం వద్ద భక్తులతో పండగ సందడిలా నెలకొంది.


కల్లూరులో సాయిబాబా ఆలయంలో పాల్గొన్న భక్తులు

నూతనోత్సాహంతో చదువుకోండి

● విద్యార్థులకు కలెక్టర్ అభిలాష అభినవ్ సూచన


విద్యార్థులతో కలిసి అల్పాహారాన్ని స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

నిర్మల్‌అర్బన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కేజీబీవీ విద్యార్థినులతో కలిసి బుధవారం ఉదయం అల్పాహారాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటిస్తూ, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. నూతన సంవత్సరంలో నూతన ఉత్సాహంతో ముందుకెళ్లాలని సూచించారు. విద్యార్థినులకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అనంతరం వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కేజీబీవీ విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

డీఈవో రామారావు


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో రామారావు

పెంబి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డీఈవో రామారావు అన్నారు. మండలంలోని మందపల్లిలోని కస్తూర్బా పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని విద్యార్థులకు మెనూ ప్రకారం... నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. అనంతరం పాఠశాలలో, వంటగది, పరిసరాలను పరిశీ లించారు. రాబోయే వార్షిక పరీక్షల్లో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రాంచం దర్, ఆర్‌ఐ శత్రుఘన్, తదితరులున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నర్సాపూర్(జి), జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చాక్‌పెల్లి గ్రామంలో హిమ్మత్‌రావు పటేల్ స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ అట్టహాసంగా ముగిసింది. విజేత జట్టుకు ఏడు వేల రూపాయల నగదు బహుమతి, కప్పు అందజేశారు. రెండోబహుమతిగా నాలుగు వేల రూపాయల నగదు అం దజేశారు. ఈ సందర్భంగా మోతిలాల్ పటేల్ మాట్లాడుతూ... క్రీడలు శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసానికి దోహదపడతా యని, యువకులు సోదరభావం తో మెలిగి ప్రశాంత వాతావరణంలో టోర్నమెంట్ ముగించడం సంతోషకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త సయ్యద్ కలీం, వెంకట్, నర సింహ రెడ్డి డాక్టర్ భోజన్న, సయ్యద్ ఆజామ్, ప్రింటర్స్ అసోసియేషన్ సభ్యుడు సయ్యద్ షఫీ, మేనేజ్‌మెంట్ సభ్యులు సయ్యద్ ఫిర్దోస్, ఫహీం, ఆమెర్, తదిత రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్‌కు అన్ని విధాల అవస రాలను సమకూర్చిన మోతిలాల్ పటేల్‌ను మేనేజ్‌మెంట్ సభ్యులు ఘనంగా సన్మానించారు.

జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవం ప్రారంభం

నిర్మల్ కల్చరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ ఆర్టీసీ డిపో ప్రాంగణంలో బుధవారం జాతీయ రోడ్డుభద్రతా మాసోత్సవాన్ని మేనేజర్ ప్రతిమా రెడ్డి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ... ఈ నెల 31 వరకు మాసోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రమాదాలు జరగడానికి కారణాలు, వాహనాల ఓవర్‌టేక్ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

గాంధీ విగ్రహం వద్ద జెండాలు ధ్వంసం

నిర్మల్‌రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఆకతాయిల ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. హద్దులు దాటి కొందరు వికృతంగా ప్రవర్తిస్తున్నారు. ఇటీవల మండలంలోని నీలాయిపేట్ బస్టాండ్ వద్ద ఉన్న గాంధీ విగ్రహాన్ని మంగళ వారం రాత్రి ఆకతాయిలు అవమానించారు. ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం రాత్రి సమయంలో అనంతపేట్ గ్రామానికి చెందిన కొంతమంది ఆకతాయిలు బస్టాండ్‌లో కొత్తసంవత్సరం సందర్భంగా వేడు కలు చేస్తున్న వారి దగ్గరికి వెళ్లి గొడవ పడ్డారు. తాగినమైకంలో బస్టాండ్‌లో ఉన్న గాంధీ విగ్రహం దగ్గర బీడీలు, సిగరెట్లు పెట్టి అక్కడ ఉన్న జెండాలను ధ్వంసం చేశారు. బుధవారం సబ్‌డివిజన్ ఏఎస్పీగా బాధ్యతలు తీసుకున్న రాజేష్ మీనా ఐపీఎస్ తక్షణమే స్పందించి సీఐ రామకృష్ణతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు విచారణలో తగు సూచనలు చేశారు.


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ

ఘనంగా విజయ్ దివస్

నిర్మల్ కల్చరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లోని బుద్ధవిహార్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా విజయ్‌దివస్ ఘనంగా నిర్వహించారు. భీమ కోరేగాం యుద్ధంలో అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించి పీష్వా సైన్యాలను ఓడించిన మహార్ నాయకులకు నివాళులర్పించారు. కమిటీ నాయకులు వెంకట్ స్వామి, మధుకర్, మునేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఏఎస్పీ


ఎస్పీని కలిసిన ఏఎస్పీ రాజేష్

నిర్మల్ కల్చరల్, జనవరి 1 (ఆంధ్ర జ్యోతి) : నిర్మల్ సబ్‌డివిజన్‌కు ఏఎస్పీ రాజేష్ మీనా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం ఇటీవల ఆయనను నూతనంగా నిర్మల్ జిల్లాకు ఏఎస్పీగా నియమించింది. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన రాజేష్ మీనా జోద్పూర్ ఐఐటీలో ఇంజి నీరింగ్ పూర్తి చేశారు. 2022లో సివిల్స్ రాసి ఐపీఎస్‌గా సెలెక్ట్ అయ్యారు. శిక్షణ పూర్తి చేసిన మీనా గ్రేహౌండ్స్‌లో దళ కమాండర్‌గా విధులు నిర్వర్తిం చారు. ప్రస్తుతం నిర్మల్ జిల్లా ఏఎస్పీగా నియమితులయ్యారు. మర్యాదపూర్వకంగా ఆయన జిల్లా ఎస్పీ జానకి షర్మిలను కలిశారు.

కదిలి పాపహరేశ్వర స్వామిని దర్శించుకున్న న్యాయాధికారి


న్యాయాధికారిని సత్కరిస్తున్న అర్చకులు

దిలావర్‌పూర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీ కదలి పాపహరేశ్వర స్వామిని నిజామాబాద్ జిల్లా న్యాయాధికారి ఆశాలత బుధవారం దర్శించుకున్నారు. కుటుంబసభ్యులతో కలిసి వచ్చిన న్యాయాధికారి ఆశాలత పాప హరేశ్వర స్వామికి అభిషేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి చెంతనే కొలువైన శ్రీ మాతాన్న పూర్ణేశ్వరిదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాశస్త్యాన్ని అర్చకులను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి ఒడిలో కొలువైన మాతా అన్నపూర్ణ పాపహరేశ్వర స్వామి చెంత ప్రశాంతమైన వాతావరణం, ఆహ్లాదాన్ని పంచుతుందని ఆమె పేర్కొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు పంచాక్షరి న్యాయాధికారిణి దంపతులను శాలువాతో సత్కరించారు.